andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.9 ၊ కనిష్ఠం 24.7
నిర్మల్ జిల్లా వార్తలు
8
శనివారం 19 అక్టోబరు 2024

కోరలు చాస్తున్న ఇసుక మాఫియా



- జగిత్యాల కేంద్రంగా భారీ ఇసుక దందా
- అడ్డాగా మారిన జిల్లా కేంద్రం
- ప్రధాన వీధుల్లోనే ఇసుక డంపులు
- పట్టించుకోని జిల్లా అధికారులు

నిర్మల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమ ఇసుక దందా కోరలు చాస్తోంది. ప్రతీ రోజూ లక్షల రూపాయల్లో సాగుతున్న ఈ అక్రమ ఇసుక దందాపై సంబంధిత అధికారుల నిఘా కరువవ్వడంతో ఈ దందా చేసే వ్యాపారులకు వరమవుతోంది. జగిత్యాల కేంద్రంగా ఈ ఇసుకదందా భారీ ఎత్తున సాగుతున్నట్లు చెబుతున్నారు. జగిత్యాల నుంచి నిర్మల్ వరకు ఈ ఇసుకను తరలిస్తున్నారు. దీంతో పాటు పెద్దవాగు, మామడ, కడెం మండలాల్లోని వాగుల నుంచి కూడా ఇసుకను నిర్మల్‌కు తరలిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే మొత్తం జీరో విధానంలో జరుగుతున్న ఈ అక్రమ ఇసుక దందా కారణంగా ప్రభుత్వానికి లక్షల రూపాయల రాయల్టీ నిధుల నష్టం జరుగుతోందని అంటున్నారు. అయితే రాజకీయ నేతలే ఈ దందా వెనక అసలు సూత్రధారులుగా ఉండడంతో సంబంధిత అధికారులు సైతం వీరిపై చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్నారంటున్నారు. గతంలో పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు ఉమ్మడిగా అక్రమ ఇసుక దందాపై నిఘా సారించి దాడులు నిర్వహించేవారు. దీనికి తోడుగా వాహనాలను సీజ్ చేసి భారీ జరిమానాలు విధించేవారు. అయితే రాజకీయ నేతలు తమ పలుకుబడితో అధికారులపై అన్ని రకాల ఒత్తిడులు తీసుకువచ్చి చర్యలు లేకుండా చూసుకుంటున్నారంటున్నారు. కొంతమంది అధికారులు ఒత్తిళ్లకు భయపడకుండా చర్యలు తీసుకునేందుకు సహసం చేస్తుండడంతో వారిని భయభ్రాంతులకు గురి చేసి వారిపై బదిలీ వేటు వేయిస్తున్నారంటున్నారు. అయితే ప్రతీ రోజూ లక్షల రూపాయల్లో సాగే ఈ దందా రాజకీయ నేతలకు కాసుల వర్షం కురిపిస్తోందని అంటున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయల్లో ఆదాయం కోల్పోతున్నప్పటికీ సంబంధిత యంత్రాంగం ఆ దిశగా దృష్టి సారించకపోతుండడం విమర్శలకు తావిస్తోంది.

జగిత్యాల టూ నిర్మల్

జగిత్యాల కేంద్రంగా సాగుతున్న ఈ ఇసుక దందాకు నిర్మల్ వ్యాపార అడ్డాగా మారిందని అంటున్నారు. ఇసుక దందా చేసే వ్యక్తులు జగిత్యాల్ నుంచి నిర్మల్ వరకు కొంత మంది పైలెట్‌లను పెట్టుకొని లారీల్లో ఇసుకను ఇక్కడికి తీసుకువస్తున్నారు. అయితే మార్గమధ్యంలో ఎవరైనా పోలీసులు గానీ, మైనింగ్ అధికారులు గానీ అడ్డు రాకుండా వీరు ముందస్తుగానే చర్యలు తీసుకుంటున్నారని అంటున్నారు. ఒకేసారి మూడు, నాలుగు భారీ డంపర్‌లలో ఈ ఇసుకను దర్జాగా ప్రధాన రోడ్డు మార్గం గుండానే తరలిస్తున్నారంటే ఈ అక్రమార్కులకు ఎంత మేరకు అండదండలున్నాయో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. రాజకీయ అండదండలతోనే ఈ అక్రమార్కులు నిర్భయంగా ఇసుకను తరలించి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారంటున్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లోనే ఈ దందా సాగుతుందని చెబుతున్నారు. అయితే ప్రతీరోజూ ఈ రోడ్డు మార్గం గుండా ప్రయాణించే ఈ ఇసుక వాహనాల నంబర్లను సైతం కొంతమంది అధికారులకు సుపరిచితమేనని, దీని కారణంగా ఆ వాహనాలను అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

కాలనీల్లోనే ఇసుక డంపులు

కాగా నిర్మల్ పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో ఈ అక్రమార్కులు ఇసుక డంపులను ఏర్పాటు చేస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ప్రియదర్శిని నగర్, ఈద్గాం, శాస్త్రీనగర్, భాగ్యనగర్, ఎఎన్ రెడ్డి కాలనీ, ఆదర్శనగర్, శాంతినగర్, రవి నగర్‌లతో పాటు తదితర కాలనీల్లో బహిరంగంగానే ఇసుక డంపులు దర్శనమిస్తున్నాయి. ఈ ఇసుక వ్యాపారులు కాలనీల్లోని ఖాళీ స్థలాలను లీజుకు తీసుకొని అక్కడే డంప్ చేస్తున్నారంటున్నారు. అయితే జనావాసాల్లోనే ఈ ఇసుక డంపులు ఏర్పాటు చేస్తుండడం ఆ ఇసుకను తరలించేందుకు వస్తున్న వాహనాల కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులపాలవుతున్నారంటున్నారు. వేళాపాల లేకుండా ఇసుక కోసం కాలనీల్లోని వస్తున్న ఈ భారీ వాహనాలు ప్రమాదాలకు సైతం కారణమవుతున్నాయంటున్నారు.

భారీ ఆదాయం నష్టం..

ఇదిలా ఉండగా అక్రమ ఇసుక తరలింపు, అమ్మకాల కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన పెద్దమొత్తం ఆధాయానికి గండి పడుతుందని అంటున్నారు. ముఖ్యంగా మైనింగ్ శాఖకు రాయల్టీ రూపంలో ఇసుక ద్వారా ఆధాయం సమకూరాల్సి ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నేతల ఒత్తిళ్ల ప్రలోభాలు భారీగా లంచాల కారణంగా మైనింగ్ శాఖ ఆదాయానికి గండి పడుతోందంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు తూతూమంత్రంగా టార్గెట్‌లను చూపుతూ అక్రమ దందాను పట్టించుకోవడం లేదంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఈ అక్రమ ఇసుక దందాను అడ్డుకొని సర్కారు ఆధాయాన్ని కాపాడాలని కోరుతున్నారు. అలాగే జనావాసాల్లో ఏర్పాటు చేస్తున్న ఇసుక డంపులను తొలగించి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అంటున్నారు.



జగిత్యాల నుంచి తీసుకువచ్చిన ఇసుకను డంపు చేస్తున్న దృశ్యం

త్రిపుల్ ఐటీని అన్నిరంగాల్లో ముందుంచుతాం

- బాసర త్రిపుల్ ఐటీ నూతన వైస్ ఛాన్సలర్ గోవర్ధన్
- బాధ్యతల స్వీకరణ
- క్యాంపస్‌లో పర్యటన



యూనివర్సిటీ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న నూతన వీసీ గోవర్ధన్

బాసర, అక్టోబర్, 18 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ త్రిపుల్ ఐటీని అన్ని రంగాల్లో ముందుంచుతామని నూతన వైస్ చాన్సలర్ గోవర్ధన్ అన్నారు. అధికార బాధ్యతలు స్వీకరించిన ఆయన త్రిపుల్ ఐటీ క్యాంపస్ శుక్రవారం సందర్శించారు. పరిపాలన అధికారి రణధీర్ సాగి పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం పరిపాలన భవనంలో సమావేశమై యూనివర్సిటీ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్యాంపస్ అంతా కలియ తిరిగి ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలను రుచి చూశారు.ల్యాబ్‌లు, తరగతి గదులు, వసతులన్నింటిని తనిఖీ చేశారు. కోర్సులు, విద్యార్థుల సంఖ్య, రోజువారి టైంటేబుల్ వాటిపై ఆరా తీశారు. విద్యతో పాటు క్రీడా సాంస్కృతిక రంగాల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిని పెంచేలా అవసరమైన నూతన కోర్సులను ప్రవేశపెడుతామని చెప్పారు. విద్యార్థుల సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. పరిపాలన, ఫైనాన్స్, స్కాలర్‌షిప్, అకాడమిక్, స్టూడెంట్ వెల్ఫేర్, లైబ్రరీ, ప్లేస్మెంట్ సెక్షన్‌ల వారీగా పరితీరు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ పరిపాలన అధికారి రణధీర్ సాగి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వాహనాల పంపిణీకి లబ్ధిదారుల ఎంపిక



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన వికలాంగులకు రెట్రో ఫిట్టెడ్ మోటార్ వాహనాల పంపిణీకి శుక్రవారం లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆధ్వర్యంలో స్ర్కీనింగ్ కమిటీ ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహించింది. లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. డీఎంహెచ్‌వో, డీఆర్డీవో విజయలక్ష్మి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చదరంగంలో జోనల్ స్థాయికి కేజీబీవీ విద్యార్థిని ఎంపిక

నర్సాపూర్(జి), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల పదవ తరగతి విద్యార్థిని కదం ప్రతిభ చదరంగంలో ప్రతిభ కనబరిచి జోనల్ స్థాయికి ఎంపికైంది. జిల్లా స్థాయిలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో శుక్రవారం వెంగ్వాపేట్ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చదరంగం పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచింది. విద్యార్థినిని పాఠశాల ఎస్‌వో వీణ, ఉపాధ్యాయులు అభినందించారు.

మీసేవ రాష్ట్ర ఫెడరేషన్ కమిటీలో జిల్లా వాసులు



ఎన్నికైన మీసేవ రాష్ట్ర ఫెడరేషన్ కమిటీ

నిర్మల్ అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి మీసేవ సంఘ ఎన్నికల్లో జిల్లా వాసులకు పదవులు దక్కాయి. అందులో భాగంగా ఖానాపూర్ మీసేవ నుంచి కామోజీ వేణుగోపాల్ రాష్ట్ర మీఇయా బాధ్యులుగా, అలాగే జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుగా మెరుగు పవన్‌కుమార్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర కమిటీలో ఏకగ్రీవంగా ఎంపిక కాబడ్డ అధ్యక్షులు భైర శంకర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మోహిద్‌లు తమపైన నమ్మకంతో జిల్లాకు రాష్ట్ర కమిటీలో పదవులు అప్పజెప్పారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మీసేవ ఆపరేటర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. గత పదేళ్లుగా కమిషన్ పెంచడం లేదని, హామీలు ఇస్తున్నారు తప్ప ఎక్కడ అమలుకు నోచుకోవడం లేదన్నారు. గృహజ్యోతి కింద మీసేవలకు ఉచిత విద్యుత్ అలాగే, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, పహాణీ, వన్ బి సర్వీసులు పునరుద్ధరణ తదితర సమస్యల పట్ల నవంబరు 4న జరిగే సమావేశంలో సీఎంని కలవడానికి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

మేం పడుతున్న బాధలు మీరు పడొద్దు

- బండారి లక్ష్మయ్య, చిత్తనూరు రైతు




బండారి లక్ష్మయ్య

దిలావర్‌పూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమ వల్ల మేం అనుభవిస్తున్న బాధలు మీరు పడొద్దని చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు, రైతు బండారి లక్ష్మయ్య అన్నారు. ఇథనాల్ పరిశ్రమ వల్ల నీరు కలుషితమైన చర్మ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నామన్నారు. వాయుకాలుష్యంతో లంగ్స్ దెబ్బతిని బాధపడుతున్నామన్నారు. అటువంటి బాధలు మీరు పడొద్దన్నారు. అందుకోసం ఇప్పుడే అప్రమత్తమై ఇథ నాల్ పరిశ్రమను అడ్డుకోవాలన్నారు. గ్రామస్థులందరూ ఐక్యంగా ఉంటేనే సాధ్య మవుతుందన్నారు. అయితే పాలక వర్గాలు, ప్రజా ప్రతినిధుల మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. మేము అలాగే మోసపోయమన్నారు. మీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో బీజేపీ శాసనసభ పక్ష నాయకుడిగా అన్ని మాట్లాడుతాడని, మరి ఆయన నియోజకవర్గంలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అందుకే మీరందరూ రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. మీకు అండగా మేము సైతం ఉంటామని అన్నారు.

గుంతలు గుంతలుగా మారిన రహదారి

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహన చోదకులు



సారంగాపూర్, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి) : మండలంలో గల మహబూబ్ ఘాట్ వద్ద నిర్మల్, ఆదిలాబాద్ రహదారి గుంతలు గుంతలుగా మారింది. ప్రతి నిత్యం వేలాది సంఖ్యలో ప్రయాణికులు ఇతర గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి గుంతలు గుంతలుగా మారడంతో ప్రయాణికులు, వాహన చోదకులు అర చేతిలో ప్రాణాలను పెట్టుకొని ప్రయాణిస్తున్నామని, ఈ రోడ్డుపై వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రయా ణికులు పేర్కొంటున్నారు. ఘాట్ రోడ్డు వద్ద దీనికి తోడు మూలమలుపులు ఉండడంతో పాటు గుంతలు గుంతలుగా మారడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని గతంలో ఈ ఘాట్‌రోడ్డు వద్ద ఎన్నో ప్రమాదాలు జరిగాయని దీంతో ఈ రోడ్డుపై ఇతర ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలపై, ప్రైవేట్ వాహనాలపై రాకపోకలు సాగించాలంటే భయాందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికులను, వాహనదారులను దృష్టిలో ఉంచుకొని వెంటనే గుంతలు గుంతలుగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు పేర్కొంటున్నారు.

పరిశ్రమల అనుమతుల జారీ పారదర్శకంగా ఉండాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : టీఎస్ ఐపాస్ వెబ్‌సైట్‌లో పరిశ్రమల అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తు అనుమతుల జారీ పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలు, అనుమతులు తిరస్కరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నియమాలు పాటించిన వారికే ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలన్నారు. ధ్రువపత్రాలు నిశితంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తిరస్కరణకు గల కారణాలు తెలియజేయాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల నుండి దరఖాస్తులు ఎక్కువగా వచ్చేట్లు చూడాలన్నారు. ఈ పథకంపై అవగాహన కలిగేలా సమాచారం అందుబాటులో ఉంచాలన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాలున్నాయని తెలిపారు. పరిశ్రమల శాఖ జీఎం నరసింహారెడ్డి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, ఎస్సీ సంక్షేమ జిల్లా అధికారి రాజేశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన కలెక్టర్

భారతదేశ ప్రీమియర్ క్రియేటివిటీ నేషనల్ అండ్ ఇంటర్ స్కూల్ పెయింటింగ్, వ్యాసరచన పోటీలో మూడోస్థానంలో నిలిచిన ప్రశస్తిని కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం అభినందించారు. వేదం గ్లోబల్ స్కూల్‌లో ప్రశస్తిని తొమ్మిదో తరగతి చదువుతోంది. జాతీయ స్థాయిలో మూడోస్థానం దక్కించుకోవడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుడు భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాడితేనే విజయం సాధిస్తాం

- దిలావర్‌పూర్ ప్రజాగళం బహిరంగసభలో ప్రొఫెసర్ కోదండరాం



ప్రజాగళం సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం, సంధ్య



సభలో నినాదాలు చేస్తున్న మహిళలు

దిలావర్‌పూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంఘటితంగా పోరాడుతేనే విజయం సాధిస్తామని శాసనమండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా శుక్రవారం దిలావర్‌పూర్ ప్రజాగళం బహిరంగ సభలో కోదండరాం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా ఏ పని తలపెట్టినా అది ప్రజా ఉద్యమానికి దారితీస్తుందన్నారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా దిలావర్‌పూర్ గ్రామస్థులు చేస్తున్న ఉద్యమం స్ఫూర్తిదాయకమన్నారు. ముందు ముందు ఇదే స్ఫూర్తిని, ఐక్యతను కొనసాగించాలన్నారు. మీ బాధలు, కష్టాలు ఆలోచనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా... మీరు నేను సీఎంను కలిసి సమస్యను వివరిద్దామని అన్నారు. మీ పక్షాన నేను నిలబడుతానని హామీ ఇచ్చారు. అయితే లక్ష్యం సాధించే వరకు నిద్రపోవద్దన్నారు. ఇదే ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ శాంతియుతంగా గాంధీయమార్గంలో ఉద్యమం చేయాలన్నారు. మీ ఉద్యమానికి నా సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు.

ఇథనాల్ పరిశ్రమతో పర్యావరణానికి తీవ్ర నష్టం : ప్రొఫెసర్ బాబురావు

ఇథనాల్ పరిశ్రమలతో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ బాబురావు అన్నారు. ప్రజాగళం బహిరంగ సభలో మాట్లాడారు. పరిశ్రమలను వ్యతిరేకించడం లేదని అలా అని సమర్థించడం లేదన్నారు. పరిశ్రమలతో ప్రజలకు జరిగే లాభ నష్టాలను బేరీజు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాయన్నారు. ఇథనాల్‌కు బదులు సోలార్ విద్యుత్ ఇంధనాన్ని ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ పరిశ్రమ వల్ల గాలి, నీరు భూమి కాలుష్య కోరల్లో చిక్కుకుంటుందని, తద్వారా పర్యావరణం పూర్తిగా దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఇథనాల్ పరిశ్రమ తీవ్ర ఆహార సంక్షోభానికి దారితీస్తుందన్నారు. హైదరాబాద్‌లో జిలుగు వెలుగులు కాదని పల్లెల్లో ప్రజల బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని ప్రశ్నించారు. మనం ఉద్యమం చేస్తే కేసులు వేసి వేధిస్తున్నప్పటికీ మనం రెచ్చిపోకుండా గాంధీ మార్గంలోనే పోరాటం చేద్దామన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వాలు

ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మభ్య పెడుతున్నాయని వాటి ఉచ్చులో పడి భవిష్యత్ తరాల జీవితాలను నాశనం చేయొద్దని టీపీజేఏసీ కో కన్వీనర్ కన్నీగంటి రవి అన్నారు. ముఖ్యంగా ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యాలు ఇథనాల్ పరిశ్రమ వస్తే రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని, మంచి మద్దతు ధర చెల్లిస్తామని, అలాగే స్థానిక యువకులకు ఉద్యోగాలు ఇస్తామని, ఇథనాల్ పరిశ్రమ నుంచి కాలుష్యం రాదని అధునాతన టెక్నాలజీని వాడుతున్నామని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అయితే పరిశ్రమ నిర్మాణం పూర్తయి పని చేయడం ప్రారంభిస్తే ఇవేమి ఉండవన్నారు. కొనుగోలు చేస్తామన్న ధాన్యం, మొక్కజొన్న తదితర ముడిసరులను దూర ప్రాంతాల నుంచి తక్కువ ధరలో తెచ్చుకుంటారని, అలాగే స్థానిక యువకులకు ఉద్యోగాలు ఇవ్వరని తక్కువ వేతనాలకు బీహార్, మహారాష్ట్రల నుంచి తెచ్చుకొని వారితో పని చేయిస్తారన్నారు. కాలుష్యం రాదని ఎలా నమ్మమంటారని అన్నారు.

సబ్సిడీలు దొబ్బేందుకే పరిశ్రమలు పెడుతున్నారు : సంధ్య

ఎంతో మంది ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ తెచ్చుకుంటే మళ్లీ ఏలూరు నుంచి దిలావర్‌పూర్ వచ్చి పరిశ్రమ పెట్టుడేంది. అందుకు అప్పటి కేసీఆర్, ఇప్పటి రేవంత్ రెడ్డిలు వత్తాసు పలుకుడేందని పీవోడబ్ల్యూ జాతీయ అధ్యక్షురాలు వి. సంధ్య అన్నారు. అంటే ఇక్కడ నుక్సాన్ చేద్దామని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికి రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞం అన్నారు. కేసీఆర్ కాళేశ్వరం అన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన, హైడ్రా అంటున్నారని విమర్శించారు.

సంక్షిప్త సమాచారం

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఖానాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖానాపూర్, సుర్జాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో నేడు నెలవారి మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఖానాపూర్ విద్యుత్‌శాఖ రామ్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సందర్భంగా ఖానాపూర్, సుర్జాపూర్ సబ్ స్టేషన్ల పరిధిలో ఖానాపూర్, మస్కాపూర్, సుర్జాపూర్, బాధనకుర్తి, వెంకటాపూర్, ఎగ్బాల్‌పూర్ గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. మరమ్మతుల నేపథ్యంలో కలగనున్న ఈ అంతరాయాన్ని గమనించి ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఉదయం 9:30 నుండి 11:30 వరకు పాత బస్టాండ్, మార్కెట్, ఏరియా ఆసుపత్రి, ప్రియదర్శిని నగర్, సాగర్ కాలనీ, చింతకుంట వాడ, కస్బా, శిశుమందిర్, గాజులపేట్, ప్రసూతి ఆసుపత్రి, ఆర్డీవో, ఎస్పీ క్యాంపు, ఫారెస్ట్ ఆఫీస్, తదితర ప్రాంతాల్లో ఈ అంతరాయం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అధికారులు తెలిపారు. ఆదర్శనగర్, రాంనగర్, గాయత్రిపురం, ఆస్రా కాలనీ, ఈద్గామ్, భాగ్యనగర్, చేపల మార్కెట్ సిద్ధాపూర్, ఇందిరమ్మ కాలనీ, సోఫీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

మాదిగల అంబేద్కర్ సంఘ అధ్యక్షుడిగా లక్ష్మణ్

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మాదిగల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా అడ్డిగ లక్ష్మణ్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు నిగులపు లింగన్న శుక్రవారం నియామక పత్రాన్ని అందించారు. చిట్యాల గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఏడాదిపాటు అధ్యక్షుడిగా కొనసాగుతాడని పేర్కొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం అందజేత



రైతుకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న నేతలు

సారంగాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంసింగ్ తండాకు చెందిన చవాన్ అన్వేష్ గొర్రెలు, మేకలు పిడుగుపడి మృతి చెందాయి. బాధిత రైతుకు శుక్రవారం బీజేపీ నాయకులు రాంశంకర్‌రెడ్డి, చంద్రప్రకాష్‌గౌడ్, చెన్నూ రాజేశ్వర్, నాగారెడ్డి, సాహెబ్ రావు, వడ్డీ రాజేందర్‌రెడ్డి, వెంకటేష్‌లు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీజీవన్‌రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద భారీ స్థాయిలో పట్టుబడిన గంజాయి కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. 8 క్వింటాళ్ల 64 కిలోల గంజాయితోపాటు లారీ డ్రైవర్, క్లీనర్‌లు వసీమ్ అన్సారీ, అల్మాజ్‌లను అప్పట్లోనే అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. విచారణలో భాగంగా వారిని ఈనెల 14 నుంచి 28 వరకు పోలీసులు తమ కస్టడిలోకి తీసుకున్నారు. ఏపీ, ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముఠాలోని కీలక సూత్రదారులను మహారాష్ట్రలోని బుల్దానలో అదుపులోకి తీసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాలో కీలకంగా ఉన్న గోతీరాం సాబలే, ఆయన కుమారుడు శుభమ్ సాబ్లేతోపాటు అమర్ సింగ్, సోమ్‌నాథ్ సాబ్లేను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డి నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. జైనథ్, ఆదిలాబాద్ రూరల్ సీఐలు సాయినాథ్, ఫణిదర్, ఎస్సై ముజాయిద్, సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని బుల్దానాలో నలుగురు నిందితులను పట్టుకుని తీసుకొచ్చినట్లు డీఎస్పీ వెల్లడించారు. వీరితోపాటు లారీకి ఎస్కార్ట్‌గా కారులో వెళ్తున్న శుభం సాబ్లేతోపాటు కారును, అందులోని కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసుతో సంబంధమున్న వివిధ రాష్ట్రాలకు చెందిన అశీశ్, పండిత్‌జీ, అషుజైన్, సోను అన్సారీల కోసం గాలిస్తున్నట్లు వివరించారు. వీరి అరెస్టులో కీలకంగా వ్యవహరించిన జైనథ్, ఆదిలాబాద్ సీఐలు సాయినాథ్, ఫణిదర్, ఎస్సై ముజాయిద్, సీసీఎస్ పోలీసులకు జిల్లా ఎస్పీ అభినందించినట్లు పేర్కొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

తాంసి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోనరి మత్తడి వాగు ప్రాజెక్టు సమీపంలో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కలకలం రేపింది. జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన చౌదారపు హరికృష్ణ(27) అనే వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం మత్తడి వాగు ప్రాజెక్టు వద్దకు వచ్చాడు. ఆయన జిల్లాకేంద్రం నుంచి మోనోసిల్ అనే పురుగుల మందు తీసుకువచ్చి ఆ మందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాంసి ఎస్సై శివరాం తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గత కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయాడని అందుకే ఆత్మహత్య చేసుకున్నాడు. అని తెలిపారు. మృతురాలు భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఎస్సీ వర్గీకరణకు నిరసనగా బైక్ ర్యాలీ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రయోజనాలను ఆదేశించే ఎస్సీ వర్గీకరణను చేపట్టేందుకు పార్టీలు కుట్రలు చేస్తున్నాయని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ భవన్ నుంచి బైక్ ర్యాలీ ద్వారా అంబేద్కర్ చౌక్‌కు చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించి వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షులు యేర సుధీర్, నాయకులు మేకల మల్లన్న, మెట్టు ప్రహ్లాద్, రాజశ్వర్, అనిల్, రాఘవేందర్ పాల్గొన్నారు.

'దళిత డిక్లరేషన్‌పై ఎందుకు ఆసక్తి లేదు'

నేరడిగొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి ఎస్సీ వర్గీకరణపై ఉన్న ఆసక్తి, తొందర మేనిఫెస్టోలో పెట్టిన దళిత డిక్లరేషన్‌పై ఎందుకులెదని, ముఖ్యమంత్రి గారు మాలలపై ఉన్న ద్వేశాన్ని విడనాడాలని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరెక పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చెన్నయ్య అన్నారు. శుక్రవారంఎస్‌సి వర్గీకరణ వ్యతిరెక పోరాట సమితి బస్సు యాత్రలో భాగంగా నేరడిగోండకు చేరేకోగా మండల నాయకులు వారికి స్వాగతం పలికారు, అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేశారు. ఈసందర్బంగా ఎస్‌సి వర్గీకరణ వ్యతిరెక పోరాట సమితి చైర్మన్ చెన్నయ్య మాట్లాడుతు ఎస్‌సి వర్గీకరణ వ్యతిరెకంగా నవంబర్ 24న హైదరాబాద్‌లో జరిగే భారీ భహిరంగ సభకు మాలలు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈయాత్రలో మాల సంక్షేమ సంఘం జిల్లా అద్యక్షుడు రమేష్ కొక్కుల, జిల్లా నాయకుడు మేకల మల్లన్న, మద్దేల ఆడెల్లు, నారాయణస్వామి కుర్మే, చిప్పరి రాజేశ్వర్, విశాల్‌దాస్, లక్ష్మన్, నవీన్, ఎల్కరాజు, లతోపాటు వివిద గ్రామాల అద్యక్ష కార్యదర్శులు పాల్గోన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై..

గ్రామస్థాయిలో అవగాహన పెంచాలి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



సబ్ కలెక్టర్‌తో కలిసి సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై గ్రామస్థాయిలో అవగాహన పెంచాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ డివిజన్ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రజలకు చట్టంపై అవగాహన పెంచాలన్నారు. అట్రాసిటీ కేసు నమోదు అయినప్పుడు బాధిత కుటుంబంకు నిజంగా అన్యాయంగా జరిగినప్పుడు సత్వర న్యాయం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణాలలో, వ్యాపారుల వద్ద కొందరు స్వార్థపరులు స్వలాభం కోసం ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని అడ్డంపెట్టుకుని బెదిరింపులకు గురిచేసే వారిని అరికట్టాలని అధికారులకు సూచించారు. ఎవరికి అన్యాయం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేందర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భీం వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసీ సంఘాల నాయకులు

కొమురం భీంకు ఘన నివాళి

సిరికొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొమురం భీం వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భూమి కోసం, భుక్తి కోసం నిజాం సర్కారుపై పోరాడిన గిరిజన పోరాట యోధుడు కొమురం భీం అని కొనియాడారు. కొమురం భీం స్పూర్తితో ఆదివాసీ హక్కులను సాధించడానికి ప్రతి గిరిజన పౌరుడు నడుం భిగించాలన్నారు. ఈ సందర్బంగా ఇచ్చోడ ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కొమురం భీం ఆశయ సాధన కమిటీ మండల అధ్యక్షుడు కోట్నాక్ పాండు, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కుమ్ర యాదవ్‌రావ్, సార్మెడీ అమృత్‌రావు, గెడం దత్తు, మాజీ సర్పంచ్‌లు రఘురాం, ఒరగంటి పెంటన్న, భగవంత్‌రావ్, నాయకులు గోర్పండ్ బాలాజీ, బషీర్, షేక్ ఇమామ్, సాయిని నర్సయ్య, మాదవ్ పటేల్, కంచం లక్ష్మణ్, ఆయా గ్రామాల పటేల్‌లు, మహజన్‌లు, దేవరిలు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

'విశ్వకర్మలు సద్వినియోగం చేసుకోవాలి'

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కులవృత్తుల ద్వారా స్వయం ఉపాధి రంగాన్ని పరిపుష్టం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజనను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపునిచ్చారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న పలువురు లబ్దిదారులకు యూనిట్లు మంజూరు కాగా అందుకు సంబంధించిన పత్రాలను శుక్రవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్ రాజ్, కౌన్సిలర్లు రఘుపతి, భరత్, ఆకుల ప్రవీణ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు లాలా మున్నా, ముకుంద్, అనిల్ పాల్గొన్నారు.

'కష్టపడ్డ వారికి ప్రాధాన్యత ఇవ్వాలి'

బోథ్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు బి.మల్లేష్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీలో కష్టపడ్డ కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇవ్వలేదని పేర్కొన్నారు. కష్టపడ్డ వారికి గుర్తింపు ఇస్తూ పార్టీ పరంగా ప్రోత్సహిస్తే పార్టీ మరింత అభివృద్ధి చెంది ఆస్కారం ఉందన్నారు. ఇటీవల అధిష్ఠానానికి పంపిన ఇందిరమ్మ కమిటీలో కార్యకర్తలకు స్థానం లేదని ఆయన పేర్కొన్నారు. అధిష్ఠానానికి ఈ విషయమై వివరిస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సేవాదళ్ ఇన్‌చార్జి సల్ల రవి, తదితరులు ఉన్నారు.

వైభవంగా అంజన్న ఆలయ ప్రారంభోత్సవం

ఇంద్రవెల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆంజి గ్రామ పంచాయతీ పరిధిలో గల మామిడిగూడ గ్రామంలో శుక్రవారం నూతన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని పెద్దల సహకారంతో విరాళాలు సేకరించి ఆలయాన్ని నిర్మించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పరమహంస సద్గురు పూలాజీ బాబా తనయుడు ఇంగ్లే కేశవ్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, శిక్షణ ఎస్సై శ్యామ్‌కుమార్, గ్రామ పటేల్ పాండ్రే శ్యామ్‌రావు, ఆదివాసీ ఆంధ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడే కైలాష్, ఉద్యోగులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాకురే రాందాస్, జిల్లా అధ్యక్షుడు ముఖడే విష్ణు, ప్రధాన కార్యదర్శి కరాడే మారుతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, ధనాజీ, సూదం పరశురాం, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ఆదివాసీ ఆంధ్ సంఘం నాయకులు



బదిలీపై వెళుతున్న న్యాయాధికారిని సన్మానిస్తున్న న్యాయవాదులు

న్యాయ విజ్ఞాన సదస్సులతో చైతన్యం

బోథ్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలలో న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించి ప్రజలలో చైతన్యం తీసుకువచ్చిన న్యాయాధికారి సేవలు మరువలేమని బోథ్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావు దేశ్‌పాండే పేర్కొన్నారు. శుక్రవారం బోథ్ మండల కేంద్రంలోని కోర్టులో బదిలీపై వెళుతున్న న్యాయాధికారి బి.హాస్సేన్‌ను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావు దేశ్‌పాండే మాట్లాడారు. ఇందులో పీపీ శ్రీధర్, ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు సుభాష్, మోహన్‌రావు, రుపేందర్ సింగ్ హరీష్, విజయ్, దమ్మపాల్, విక్రం, జమీర్‌లతో పాటు కోర్టు సూపరింటెండెంట్ శేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ధన్నూర్ పాఠశాలలో డీఈవో తనిఖీ

బోథ్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నూర్ గ్రామ ప్రాథమిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను డీఈవో ప్రణీత శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి పాఠశాలలో పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రావుల శంకర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు, ఉపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్, భువనగిరి సారిక, స్వప్న, సరిత, సీఆర్పీ రమేష్, తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

బోథ్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు బోథ్ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతుందని అయితే మండలంలోని కార్యకర్తలు ప్రతీఒక్కరు సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగు బ్రహ్మానందం కోరారు. పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు కార్యకర్తలు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ బోరే రవీందర్, జిల్లా బాధ్యులు బీజేవైఎం నాయకులు, మండల బాధ్యులు సీనియర్ నాయకులు బోథ్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

'గ్రామాల్లో నాయకులను నిలదీయాలి'

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ నాయకులను గ్రామాల్లో నిలదీయాలని, సీసీఐ కేంద్ర పరిధి అంశంలో ఉన్నప్పటికీ బీజేపీ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ సమస్యను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న ఫైర్ అయ్యారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఎంపీటీసీల పరిధిలోని యాపల్‌గూడలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 24న ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించే కేటీఆర్ సభను విజయవంతం చేయా లని కోరారు. ఇందులో మాజీ ఎంపీపీ గంద్రత్ రమేష్, రోకండ్ల రమేష్, ఇజ్జగిరి నారాయణ, పెందుర్ గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

బోథ్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర, మందబోగూడ, రఘునాథపూర్ గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ పరిశీలించారు. పోషణ్ చర్చ కార్యక్రమంలో భాగంగా పలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రఘునాథ్‌పూర్‌లో భోజనాన్ని, పొచ్చెరంలో రికార్డులను పరిశీలించారు. అయితే, గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు లేక విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారని గమనించినట్లు ఆయన పేర్కొన్నారు.

పోలీసు అష్ట దిగ్బంధంలో దిలావర్‌పూర్



ఇథనాల్ పరిశ్రమకు వెళ్లే రోడ్డును మూసివేసి కాపాలా ఉన్న పోలీసులు

దిలావర్‌పూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా దిలావర్‌పూర్‌లో జరిగిన ప్రజాగళం బహిరంగ సభ నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా మొహరించారు. దిలావర్‌పూర్ చుట్టూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. దిలావర్‌పూర్ నుంచి ఇథనాల్ పరిశ్రమకు వెళ్లే రోడ్డును పూర్తిగా మూసివేశారు. దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ వద్ద వందల మంది పోలీసులను మొహరించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన భద్రత ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. బహిరంగ సభ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

బంద్ విజయవంతం

ఇథనాల్‌కు వ్యతిరేకంగా ఇచ్చిన దిలావర్‌పూర్ బంద్ విజయవంతమైంది. వ్యాపార సముదాయాలు, హోటళ్లు, కిరాణా కొట్టులు అన్ని స్వచ్ఛందంగా మూసివేశారు. అటు ప్రజాగళం బహిరంగసభ, ఇటు బంద్ విజయవంతం కావడంతో ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ హర్షం వ్యక్తం చేసింది. సభను, దిలావర్‌పూర్ బంద్‌ను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపింది.

ఓటు హక్కు నమోదు కేంద్రం ఏర్పాటు

కుంటాల, అక్టోబర్, 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూర్ వాసవి కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేట్ ఓటు హక్కు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

ముథోల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... ముథోల్‌లోని వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సహెజ్ తండాకు చెందిన జాదవ్ భీమ్‌రావు(31) అనే వ్యక్తి ఏఎస్‌ఆర్‌ఎఫ్ (అగ్రికల్చర్ సీనియర్ రీసెర్చ్ అధికారి)గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే గురువారం రాత్రి మృతుడు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో తెలిసిన వ్యక్తి ముథోల్‌లోని ఓ ఇంటిలో అద్దె కుంటున్న మృతుడి రూమ్ వద్దకు వచ్చి చూడగా జాదవ్ భీమ్‌రావు మృతి చెంది ఉన్నాడు. ఈ విషయమై మృతుడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ముథోల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడిపై అనుమానం ఉన్నట్లు మృతుడి కుటుబ సభ్యులు ఆరోపించారు. అయితే మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

కుంటాల, అక్టోబర్, 18: (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన డొంగ్రే సచిన్ (32) గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఏఎస్సై రాందాస్ తెలిపారు. సచిన్ మద్యానికి బానిసై పనిపాట లేకుండా తిరగడం, చిన్న చిన్న అప్పుల కారణంగా మనస్థాపానికి గురయ్యాడని గురువారం రాత్రి అతని భార్య తన పిల్లలను తీసుకొచ్చేందుకు కల్లూర్ గ్రామంలోని పుట్టింటికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో ప్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడ్డట్లు, మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చెరువులను ఆక్రమిస్తే కాంగ్రెస్ నాయకులైనా చర్యలు తప్పవు

● ఖానాపూర్, కడెం మండలాల పర్యటనలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



కడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఖానాపూర్‌లో గీతా కార్మికులకు పనిముట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే


ఖానాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : చెరువులను ఆక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని, చివరికి కాంగ్రెస్ నాయకులై సరే చర్యలు తీసుకుని తీరుతామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ సాయికుమార్‌తో కలిసి ఖానాపూర్, కడెం మండలాల్లో ఎమ్మెల్యే బొజ్జు విస్తృతంగా పర్యటించారు. తొలత కడెం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే బొజ్జు, రాష్ట్ర మత్స్య శాఖ చైర్మన్ సాయికుమార్‌లు కడెం ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన ఎమ్మెల్యే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఖచ్చితంగా చెరువుల ఎఫ్‌టీఎల్ సర్వే జరుగుతుందన్నారు. ఇదివరకే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఖానాపూర్ నియోజకవర్గంలోని అన్ని చెరువులపై ఎఫ్‌టీఎల్ సర్వే నిర్వహించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కోరానన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటన్న నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నార న్నారు. చెరువులు ఆక్రమణకు గురికాకుండా ఉంటేనే అన్ని వర్గాల ప్రజలు ఉపాధి పొందుతారన్నారు. చెరువులు నిండుగా ఉంటే రైతులతో పాటు మత్స్యకారులు, రజకులు ఇలా ఎంతో మంది కులవృత్తుల వారు జీవనోపాధి పొందుతారన్నారు. చెరువులను ఆక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. చివరికి ఈ ఆక్రమణలకు పాల్పడింది కాంగ్రెస్ నాయకులైన చర్యలు తీసుకోబడతాయని ఎమ్మెల్యే హాట్ కామెంట్స్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులైన హరీష్‌రావు, కేటీఆర్‌లు ప్రభుత్వంపై అవాకులు, చెవాకులు పేలుతున్నారన్నారు. అనంతరం పెద్దూర్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి ఖానాపూర్ వచ్చిన ఎమ్మెల్యే బొజ్జు, రాష్ట్ర మత్స్య శాఖ చైర్మన్ సాయి కుమార్‌లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గీతా కార్మికులకు పనిముట్లను పంపిణీ చేశారు. విదేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన నేపథ్యంలో స్థానిక తెలంగాణ చౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు.

'స్కాముల ప్రభుత్వం కాదు నిరుపేద స్కీముల ప్రభుత్వం'

పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్‌ఎస్ పార్టీ లాంటి స్కాముల ప్రభుత్వం తమది కాదని... నిరుపేద ప్రజలను ఆదుకునేందుకు వచ్చిన స్కీముల ప్రభుత్వమని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. ఖానాపూర్, కడెం మండలాల పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మత్స్య కార్మికుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. త్వరలోనే కడెంలో చేపల మార్కెట్‌ను నిర్మిస్తామన్నారు. చేప పిల్లలను ప్రాజెక్టులో అధికారుల సమక్షంలో కాంట్రాక్టర్లు లెక్క ప్రకారం వదిలారన్నారు. లేనియెడల వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. చేపపిల్లల పంపిణీలో నిరక్ష్యంగా వ్యవహరించే కాంట్రాక్టర్ల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ వేరువేరు కార్యక్రమాల్లో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, మున్సిపల్ వైస్ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోట సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, జిల్లా నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, దుర్గాభవాని, జన్నారపు శంకర్, పరిమి సురేష్, అమానుల్లాఖాన్, గోవింద్, జహీర్, ఆసిఫ్‌లతో పాటు ఆయా ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, మత్స్య సంఘం, గౌడ సంఘం నాయకులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

● టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



గ్రూప్- 3 పరీక్షలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ టీజీపీఎస్సీ ప్రధాన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రూప్-3 పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షకు సంబంధించి జిల్లా నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ వ్యవహరిస్తారని తెలిపారు. అన్ని జిల్లాల్లో స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో సరిపడినంత ఫర్నిచర్, విద్యుత్, ఇతర సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. టీజీపీఎస్సీ నిబంధనలకు లోబడి పరీక్షా కేంద్రాలను కేటాయించాలన్నారు. పరీక్ష నిర్వహణకు సరిపడినంత సిబ్బందిని సమకూర్చుకోవాలని ఆదేశించారు. అధికారులు పరీక్షా కేంద్రాలను సందర్శించి అన్ని సౌకర్యాలు సరిచూసిన తర్వాతనే పరీక్షా కేంద్రాలకు అనుమతులివ్వాలని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడు తూ... గ్రూప్-3 పరీక్ష నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పకడ్బందీగా పరీక్షా కేంద్రాలను ఎంపిక చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ సమన్వయ కర్త గంగారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● ఎమ్మెల్యే పవార్ రాంరావుపటేల్




నూతన ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తానూర్, అక్టోబరు 18 : భైంసా పట్టణంలో శుక్రవారం శ్రీ దత్తసాయి మల్టీ స్పెషాలిటీ నూతన ఆసుపత్రి భవనం ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా ముథోల్ నియోజక వర్గ ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్ పాల్గొని ఆయన చేతుల మీదుగా నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి డాక్టర్ విజయానంద్ జాదవ్, డాక్టర్ వర్షా జాదవ్ ముథోల్ నియోజకవర్గ ప్రజలకు అతి తక్కువ ధరలకే వైద్య సేవలు అందించడం చాలా గర్వించదగ్గ విషయం అన్నారు. అధునాతన టెక్నాలజీతో అన్ని హంగులతో ఆసుపత్రిని నిర్మించడంతో అభినందించారు. ఈ నూతన ఆసుపత్రి భవనంలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయానంద్ మాట్లాడుతూ ముథోల్ నియోజక వర్గ ప్రజలకు అన్ని వేళలలో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తానని అన్నారు. అనంతరం ఆయా గ్రామాల నుండి వచ్చిన ప్రజలకు పెద్ద ఎత్తున మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్, మార్క్‌ఫెడ్ స్టేట్ డైరెక్టర్ గంగాచరణ్, సీనియర్ వైద్యులు డాక్టర్ దామోదర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ , మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, డా. రజినీకాంత్, ముథోల్ నియోజక వర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, భైంసా పట్టణం నుండి వైద్యులు, భైంసా పట్టణ పరిసర ప్రజలు పెద్దఎత్తున హాజరైయ్యారు.

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట

● నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి



సోయాబిన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి మాట్లాడుతూ... సోయాబిన్ పంటకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 4,892 మద్దతు ధర కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలకు రైతులు పండించిన పంటలను తీసుకోవచ్చి విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో ఈయేడు లక్ష పదివేల ఎకరాల్లో సోయాబీన్ పంటను సాగు చేశారన్నారు. ఎనిమిది లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డితో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఖానాపూర్‌లో ఘనంగా
బతుకమ్మ సంబరాలు

ఖానాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శివాజీనగర్‌లో గురువారం రాత్రి సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలను సేకరించి అలంకరించిన బతుకమ్మలతో తరలివచ్చిన మహిళలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను చాటేలా పాడిన బతుకమ్మ పాటలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మ నిమజ్జన వేడుకలను పురస్కరించుకుని మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి వేడుకలను ప్రారంభించారు. బతుకమ్మ నిమజ్జనం కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు సత్యం పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక ధ్యావతి రాజేశ్వర్, శేషాద్రి, కమలాకర్, తదితరులున్నారు.

విద్యుత్ షాక్‌తో మూగజీవాల మృతి

- వందల సంఖ్యలో మృత్యువాత పడుతున్న పశువులు
- పల్లెల్లో పొంచి ఉన్న ప్రమాదాలు
- నివారణ చర్యలు శూన్యం
- ఆందోళనలో రైతులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

బజార్‌హత్నూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగలు మూగజీవాల పాలిట యమ పాశాలు అవుతున్నాయి. మానవుడి నిర్లక్ష్యానికి పశువులు బలవుతున్నాయి. అస్తవ్యస్తమైన విద్యుత్ లైన్లు శిథిలావస్థలో ఉన్న కరెంట్ స్తంభాలు కర్రతో ఉన్న తీగలు, కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ రక్షణలేని ఎర్త్‌వైర్లు పశువులను బలిగొంటున్నాయి. చిరుగాలులు, వర్షాలకు కరెంట్ తీగలు తెగిపడడం ఎర్తింగ్ వైర్లకు అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసకుంటున్నాయి. ఒక్కోసారి కరెంట్ తీగలు తెగిపడి పదుల సంఖ్యలో గేదెలు ఎద్దులు మేకలు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతంలో ఎక్కడో ఒకచోట మూగ జీవాలు మృత్యువాత పడుతునే ఉన్నాయి.

మూడేళ్లలో 150కు పైగా మృతి

గడిచిన మూడేళ్లలో జిల్లా వ్యాప్తంగా సుమారు వందయాభైకు పైగానే మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. గతంలో బజార్‌హత్నూర్ మండలం కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఎర్త్‌వైరుకు విద్యుత్ సరఫరా అయి ఆవు దూడ మృతి చెందింది. ఇదే మండలానికి చెందిన ఎద్దులు మృత్యువాత పడ్డాయి. పశువులతో పాటు మేకలు గొర్రెలు సైతం విద్యుత్ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు విడుస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అస్తవ్యస్తంగా మారిన కరెంట్ స్తంభాలతో ప్రవ ౹ా దా ల ఎ౹ా ం చి ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పశువులు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం చేసుకుని బతికే రైతులు ఎద్దులు, గేదెల మృతితో అధికంగా నష్టపోతున్నారు.





రైతులపై ఆర్థిక భారం

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసే రైతులు అనుబంధంగా పశువుల పెంపకం చేపడతారు. ఆవులు, గేదెల ద్వారా పాల ఉత్పత్తితో పాటు సేంద్రియ ఎరువులతో ఆదాయం పొందుతారు. ఇలా రైతుకు లాభం కలుగచేసే పశువులను విద్యుత్ ప్రమాదాలు బలికొనడంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ మధ్య కాలంలో ఎడ్లు, గేదెలు తరచూ విద్యుత్ ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతుండడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

ఆవు దూడ చనిపోయింది

- కల్లెం నందు

ఇటీవల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యుత్ వైర్లు తెగిపడి కింద పడిపోయాయి. అక్కడే సమీపంలో ఒక ఆవు దూడ మేత మేస్తున్న ఆవు దూడ అకస్మాత్తుగా విద్యుత్ వైరుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.



పంట చేనులో ట్రాన్స్‌ఫర్ వద్ద ఉన్న ఎర్తింగ్ వైర్‌కు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఎద్దు (ఫైల్)

పరిహారం ఇలా..

ఎడ్లు, గేదెలు, మేకలు, గొర్రెలు కరెంట్ షాక్‌తో మృతి చెందినట్లయితే రైతులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందిస్తే సంఘటన స్థలాన్ని పరిశీలిస్తారు. పశువైద్యులు కరెంట్ షాక్‌తో మృతి చెందినట్లు నిర్ధారించిన ధ్రువీకరణ పత్రాలతో నష్ట పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఎడ్లు, గేదెలకు ఒక్కొక్కదానికి రూ.నలభై వేలు, మేకలు, గొర్రెలకు రూ. ఏడు వేల వరకు నష్ట పరిహారం లభిస్తోంది.

మరమ్మతులు చేపట్టాలి

- మేకల లింగన్న, రైతు

గ్రామాల్లో కరెంట్ తీగలు అస్తవ్యస్తంగా మారాయి. అసలే వర్షాకాలం గాలి వీచడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. అధికారులు స్పందించి కిందికి వేలాడుతున్న తీగలను కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభాలను సరి చేయాలని విద్యుత్ ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి.

ప్రమాదాల నివారణకు చర్యలు

- ఏఈ, బజార్‌హత్నూర్

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు కనీసం ఆరు పీట్లు ఉండేలా చూస్తున్నాం. గద్దెలు కిందకు ఉండడంతో వాటిని ఆనుకుని పొలం గట్లు ఉండడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భూమిలో ఉండే ఎర్త్‌వైర్లకు నీరు అందగా కొన్ని సందర్భాల్లో విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉంటుంది. కావున తప్పనిసరిగా నీళ్ల పోయాలని చెబుతున్నాం. రైతులు కూడా పశువులను అశ్రద్ధ చేయకుండా సహకరించాలి.



జర దేఖో

జల్‌కోరికి వెళ్లే దారి దుస్థితి ఇలా..

ఆదివాసీ గ్రామాలకు రహదారి కరువు

- పట్టింపు లేని అధికారులు
- రోడ్డు లేక నరకయాతన అనుభవిస్తున్న ఆదివాసీలు

భీంపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామీణ ప్రాంతాలకు కూడా రోడ్డు సౌకర్యం కల్పిస్తామని గత పాలక ప్రభుత్వాలు ఎన్నో హామీలు ఇచ్చారు. కానీ వారిచ్చిన హామీలు అమలుకు నోచుకోక పోగా ఆదివాసి పల్లె ప్రాంతాల ప్రజలు మాత్రం నరకం అనుభవిస్తున్నారు. ఆదివాసి గిరిజనులు నేటికీ కాలినడకన మైదాన ప్రాంతాలకు వచ్చి సరుకులు కొనుగోలు చేసుకుని ముల్లె మూటాలను నెత్తిన ఎత్తుకొని కాలినడకన వారి గమ్యాలకు చేరుకోవాలంటే తల ప్రాణం తోకకు వస్తుందని ఈ ప్రాంత ఆదివాసీ గిరిజన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. భీంపూర్ మండలంలోని ఆదివాసీ గ్రామాలు జల్‌కోరి, రాజుల కోరి, గొల్లగడ్, భగవాన్‌పూర్, టేక్డి రాంపూర్, రాజులవాడి, కొజ్జన్‌గూడ ఈ గ్రామాల ప్రజలు నేటికీ కాలినడకనే గమ్యాలను చేరుకోవాల్సి వస్తోంది. ముల్లె మూటాలను నెత్తిన ఎత్తుకుని ఈ రాకెట్ యుగంలో కూడా నడవాల్సిన దుస్థితి ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా కనీసం పట్టించుకోవడం లేదని గిరిజన గ్రామాల ప్రజలు అంటున్నారు. వర్షాకాలంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మోకాలు లోతు బురదతో నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆదివాసీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందరో నాయకులు, అధికారులు తమ గ్రామాలకు ఎన్నికలప్పుడు వచ్చి వెళ్లారు. తప్ప తిరిగి తమ గ్రామాలను పట్టించుకోవడం లేదని ఆదివాసీ గిరిజన ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకని తమ ఆదివాసి గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించి తమను ఆదుకోవాలని ఆయా గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

- ఆడ యువరాజ్, భగవాన్‌పూర్ వాసి

రోడ్డు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ముల్లే మూటలు నెత్తిన ఎత్తుకొని మోకాలి లోతు బురదలో కాలి నడకన తమ ఊళ్లకు చేరుకోవాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తమ గ్రామానికి రోడ్డు వేయాలని కోరుతున్నాం.

కన్నుల పండువగా వెంకన్న బ్రహ్మోత్సవాలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

ఖానాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభమైన మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో గల అతి పురాతనమైన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి వేంకటేశ్వర స్వామి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకొని ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతర కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయంలో నిర్వహించిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు బారులు తీరారు. స్వామి వారికి మొక్కులు చెల్లించు కునేందుకు ఆలయానికి తరలి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. యజ్ఞాచార్యులు చక్రపాణి నరసింహమూర్తి, ఆలయ అర్చకులు కోటపల్లి అనీష్, నితీష్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. రథోత్సవం సందర్భంగా స్వామివారి రథాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలతో సుర్జాపూర్ గ్రామం గోవింద నామస్మరణతో మార్మోగింది.



తలమడుగు కళాశాలకు ప్రహరీగోడ లేకపోవడంతో కళాశాల ఆవరణలో సంచరిస్తున్న గేదెలు

కళాశాలలో సమస్యల తిష్ట

- ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు
- ప్రహరీ లేక కళాశాలలో గేదెల సంచారం

తలమడుగు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం గత 20 సంవత్సరాల క్రితం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసింది. కానీ కళాశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు సమస్యలతోనే విద్యను కొనసాగిస్తున్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పలుమార్లు ఉన్నత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత నాలుగు సంవత్సరాల క్రితం తలమడుగు కళాశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 1.80 మంది విద్యార్థులే. కళాశాలకు వస్తున్నారు. ప్రస్తుతం కళాశాలకు ప్రతీరోజు 60 నుంచి 70 మంది విద్యార్థులు కళాశాలకు హాజరవుతున్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తే మరింత మంది విద్యార్థులు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా కళాశాలలో ప్రహరీ లేక కళాశాల ఆవరణలోనే గేదెల సంచారం ఉండటంతో విద్యార్థులకు చదువులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదే విధంగా కళాశాలలో విద్యార్థులకు తాగునీటి వసతి లేక ఇబ్బందులు తప్పడం లేదు. కళాశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైంది. ఇప్పటి వరకు ఆర్వో ప్లాంట్‌ను ఎవరూ మరమ్మతు చేయించలేదు. అదే విధంగా కళాశాలలో విద్యుత్ సౌకర్యం లేక ఫ్యాన్లు లేక విద్యార్థులు ఉక్కపోతతో చదువులను కొనసాగిస్తున్నారు. ఇటీవల డీఐవో కళాశాలను తనిఖీ చేయగా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో సెల్‌ఫోన్ లైట్‌తో రిజిష్టర్‌లను పరిశీలించిన పరిస్థితులు ఏర్పడ్డాయి. చీకటి గదిలోనే చదువులను కొనసాగిస్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కాలేజ్ పైన ఉన్న రేకులషెడ్డు మరమ్మతులకు గురి కావడంతో ఇప్పటి వరకు షెడ్యూల్ ఎవరూ మరమ్మతు చేయించలేదన్నారు. కళాశాలలో విద్యుత్ సౌకర్యం లేక చీకటి గదిలోనే విద్యను కొనసాగిస్తున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు దృష్టి సారించి కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.




కళాశాలలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో సెల్‌ఫోన్ లైట్‌తో రిజిష్టర్‌లను పరిశీలిస్తున్న డీఐవో

సమస్యల పరిష్కారానికి కృషి

- సుదర్శన్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

తలమడుగు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికార దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. గతంలో కంటే ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించి తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలకు పంపించాలని ఆయన కోరారు.



రేపు కొమురం భీం విగ్రహావిష్కరణ

ఇంద్రవెల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని హీరాపూర్ గ్రామంలో ఈనెల 20న ఆదివారం నిర్వహించే కొమురంభీం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పూర్క చిత్రు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ఆదివాసీ గిరిజన అమరవీరుల స్తూపం వద్ద విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఇందులో తుడుం దెబ్బ నాయకులు సోయం రాందాస్, గేడం భారత్, సోయం మురహరి, కనక హనుమంత రావు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో కమిటీల.. లొల్లి!

- పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు
- తమకు ఎలాంటి ప్రాధాన్యత దక్కలేదంటూ ఇన్‌చార్జీల వద్ద కాంగ్రెస్ కార్యకర్తల మొర
- పార్టీ కార్యకర్తలతోనే కమిటీలను ఏర్పాటు చేశారని విమర్శలు
- ఏజెన్సీలో గ్రామసభల నిర్ణయమే ఫైనల్ అంటున్న ఆదివాసీలు
- కలెక్టర్ వద్దకు చేరిన ఇందిరమ్మ కమిటీల జాబితా
- జిల్లావ్యాప్తంగా 468 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డుల్లో ఇందిరమ్మ కమిటీల జాబితా సిద్ధం

ఆదిలాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆదరబాదరగా అధికారులు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 468 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డుల్లో ఇందిరమ్మ కమిటీల జాబితాను సిద్ధం చేశారు. ఇప్పటికే ఆమోదం కోసం జిల్లా కలెక్టర్‌కు జాబితాను పంపించారు. ఇన్‌చార్జీ మంత్రి ఆమోదంతో కమిటీలు పని చేయనున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికతో పాటు భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీలు క్రియాశీలకంగా వ్యవహరించనున్నాయి. దీంతో గ్రామాలు, పట్టణాల కమిటీల్లో చోటు దక్కించుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు పోటీపడ్డారు. కొత్త, పాత నేతలంతా కమిటీలలో చేరేందుకు ఆసక్తి చూపెట్టడంతో కాంగ్రెస్‌లో కొత్తగా కమిటీల లొల్లి మొదలైంది. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా చూసిన ఇందిరమ్మ కమిటీల పైననే చర్చించుకోవడం కనిపిస్తుంది.

ఇన్‌చార్జీల వద్దకు పంచాయితీ

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తొలిసారిగా కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రాధాన్యతను ఇస్తూ ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. జీవో నెం.33 ప్రకారం కమిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరులు ఇద్దరు డ్వాక్రా మహిళలతో కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి చైర్మన్‌గా కమిటీలను ఏర్పాటు చేశారు. మొత్తం ఏడుగురు సభ్యులు ఉండాల్సి ఉండగా కొన్నిచోట్ల ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పదిమందికి పైగా కమిటీ సభ్యులను నియమించినట్లు తెలుస్తుంది. అయితే చాలా గ్రామాలలో కమిటీ సభ్యులుగా చేరేందుకు పోటీ ఎక్కువగా కనిపించింది. దీంతో గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో మంచి పలుకుబడి ఉన్న వారిని గుర్తించి జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. దీంతో తమకు ప్రాధాన్యత దక్కలేదంటూ కొందరు సీనియర్ కార్యకర్తలు, నేతలు నియోజకవర్గ ఇన్‌చార్జీల వద్ద మొర పెట్టుకుంటున్నారు. కావాలనే అవకాశం దక్కకుండా చేశారంటూ ఆరోపిస్తున్నారు. కొంతమంది నేతలు తమ దగ్గరి సన్నిహితులకే కమిటీలో అవకాశం కల్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిటీ సభ్యులంతా తమవారే ఉంటే, స్థానిక ఎన్నికల్లో చక్రం తిప్పే విధంగా కొంతమంది సీనియర్ నేతలు ముందుచూపుతో వ్యవహరించారన్న టాక్ వినిపిస్తోంది. అన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీలో రెండు, మూడు గ్రూపులుగా విడిపోయి, నేతలు, కార్యకర్తలు పార్టీల్లో పని చేస్తున్నారు.

అధికారుల తీరుపై విమర్శలు

గ్రామ పంచాయతీ, మున్సిపల్ అధికారులు, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి కమిటీలను ఏర్పాటు చేశారన్నా ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కడ ముందస్తు సమాచారం లేకుండానే అధికారులు కమిటీలను ఏర్పాటు చేయడంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఎవరూ లేరు. దీంతో నియోజకవర్గ ఇన్‌చార్జీలు చెప్పిందే ఫైనల్ అన్నట్లుగా మారింది. దీంతో కమిటీల్లో ఎక్కువగా కాంగ్రెస్ కార్యకర్తలే ఉన్నారని ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. స్థానిక అధికారులు నిబంధనలు పాటించకుండా హడావుడిగా ఒక్కరోజులోనే కమిటీలను ఏర్పాటు చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రతిపక్షాల విమర్శలతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చాలా గ్రామాలలో పంచాయతీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం అవుతుంది. కొన్ని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులపై ఎంపీడీవోలకు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే ప్రభుత్వమే సరైన విధివిధానాలను ప్రకటించలేదంటూ అధికారులు పేర్కొనడం గమనార్హం.

ఏజెన్సీలో వివాదం

ఇందిరమ్మ కమిటీల ఎన్నికతో ఏజెన్సీలో కొత్త వివాదం తెరపైకి వస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇందిరమ్మ కమిటీలు చట్టవిరుద్ధమని ఆదివాసీలు వాదిస్తున్నారు. ఏజెన్సీలో ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక బాధ్యత పీసా గ్రామసభలపైనే ఉంటుందని చెబుతున్నారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం సరైనది కాదంటున్నారు. ఇందిరమ్మ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరులు ఉండాలని నిబంధన ఉంది. కానీ ఏజెన్సీలో గిరిజనేతరుల నిర్ణయాలు చెల్లుబాటు కావని, ఏజెన్సీ చట్టాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో 468 గ్రామ పంచాయతీలకు గాను.. 248 గ్రామ పంచాయతీలు ఏజెన్సీ ప్రాంతాల్లోనే ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఇప్పటికే గత ప్రభుత్వ హయాంలో ఏజెన్సీ ప్రాంతాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించేందుకు ఏజెన్సీ చట్టాలు ఆటంకంగా మారాయి. ఉట్నూర్ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో ఆ ప్రక్రియ అర్థాంతరంగా నిలిచిపోయింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు లబ్ధిదారుల ఎంపికలోనూ భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులే ఎదురయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పీసా చట్టం 1996 నిబంధనలు పాటించకుండా ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.33ని ఏజెన్సీ ప్రాంతాల్లో ఎత్తివేయాలని ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు.



ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కమిటీల ఎంపిక

: జితేందర్ రెడ్డి, జడ్పీ సీఈవో, ఆదిలాబాద్



జిల్లాలో ఇందిరమ్మ కమిటీల ఎంపిక అంతా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరిగింది. గ్రామ, వార్డు స్థాయుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరులు, డ్వాక్రా మహిళలను సభ్యులుగా గుర్తించి ఎంపిక చేశాము. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు లేవు, చాలా గ్రామాలలో వంద శాతం ఎస్టీలే సభ్యులుగా ఉన్నారు. ఇందిరమ్మ పథక అమలులో కమిటీలు క్రియాశీలంగా ఉంటాయి. ఇప్పటికే కమిటీల జాబితా సిద్ధమైంది.

అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- 1.5 కేజీల గంజాయితో పాటు వ్యాను, మూడు సెల్‌ఫోన్ల స్వాధీనం
- వివరాలను వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

6



మూగజీవాలకు యమపాశాలు!!

- విద్యుత్ తీగల బారిన పడి పెద్దసంఖ్యలో పశువుల మృత్యువాత
- అయినా పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో రైతులు

7



కళాశాలలో సమస్యల తిష్ఠ!

- తలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గేదెల సంచారం
- విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

7



సంక్షిప్త సమాచారం

పకడ్బందీగా ఎల్ఆర్ఎస్

తలమడుగు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్ భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. శుక్రవారం మండలంలోని దేవాపూర్ కజ్జర్ల, తలమడుగు, తదితర గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్ భూసర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజమోహన్ మాట్లాడారు. ఇందులో ఆర్ఐ రోహిదాస్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలపై అవగాహన

తాంసి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై ప్రతీఒక్కరు దృష్టి పెట్టాలని మండల వైద్య బృందం ప్రజలకు సూచించారు. శుక్రవారం బండల నాగపూర్, అట్నంగూడ గ్రామాల్లో వైద్య బృందం పర్యటించింది. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. మురికి నీరు నిలువ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ తులసీరామ్, లక్ష్మీ, పద్మ, అరుణ, తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన

మావల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సును శుక్రవారం పట్టణంలోని నలంద కళాశాలలో నిర్వహించారు. దీనికి నిజామాబాద్ నార్కోటిక్ డీఎస్పీ సోమనాథ్, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు షీ టీమ్ అత్యవసర హెల్ప్ లైన్ నెంబర్ల గురించి వివరించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందులో డీసీఆర్‌బీడీఎస్ పీడీ సురేందర్‌రెడ్డి, సీఐ బి.ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ పున్నారావు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆసుపత్రిలో సమస్యల పరిష్కారానికి కృషి

- తలమడుగులో పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో కృష్ణ
- సిరికొండ మండలం బోరింగ్‌గూడలో అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు



తలమడుగు ఆసుపత్రిలో రిజిష్టర్లు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బోరింగ్‌గూడ అంగన్‌వాడీ భవనంలోని గదిలో మరమ్మతులు చేపట్టారిలా..

తలమడుగు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్యాధికారి డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ తనిఖీ చేశారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురణమైన మరుగుదొడ్ల మరమ్మతులు ఎప్పుడో? అనే కథనం ప్రచురణ కావడంతో.. స్పందించిన జిల్లా వైద్యాధికారి తలమడుగు ఆసుపత్రిని తనిఖీ చేసి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదే విధంగా మరుగుదొడ్ల మరమ్మతులు నోచుకోకపోవడంతో వాటిని పరిశీలించి త్వరలోనే మరమ్మతులు చేపడతామన్నారు. అంతేకాకుండా సిబ్బంది సమయ పాలన పాటించి గ్రామీణ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మాత శిశు మరణాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రిలో ఎలాంటి మందుల కొరత లేకుండా చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఆసుపత్రిని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిష్టర్‌ను పరిశీలించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. విధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఇందులో వైద్యాధికారి డాక్టర్ వంశీ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు

సిరికొండ(ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చింపూర్(బి) గ్రామ పంచాయతీ పరిధిలో గల బోరింగ్‌గూడలో అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేపట్టారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో 'అధ్వానంగా అంగన్‌వాడీ భవనం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా స్పందించారు. పీవో ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమశాఖ డీఈ శివప్రసాద్, ఏఈ సతీష్, ఐసీడీఎస్ సూపర్వైజర్ విమలలు బోరింగ్‌గూడలోని అంగన్‌వాడీ భవనాన్ని సందర్శించి అధ్వానంగా మారిన భవనం గదికి గుత్తేదారు చేత మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా గది నేల అంతా గుంతలుగా మారిందని, ఎవరికీ చెప్పినా స్పందించలేదని వారు ఈ స ందర్భంగా పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతోనే మా సమస్య పరిష్కారం అయ్యిందని గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో, ఆదివాసీ గిరిజనులు

నూరు వర్ధంతి సభ పోస్టర్ల ఆవిష్కరణ

ఉట్నూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కొలాం వీరరత్న, అమరజీవి కుమ్రం నూరు 27వ వర్ధంతి పోస్టర్లను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కుష్బుగుప్త, మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని ప్రాజెక్ట్ అధికారి క్యాంపు కార్యాలయంలో ఈనెల 25న మండలంలోని న్యూ కొలాంగూడలో జరిగే నూరు 27వ వర్ధంతి సభ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివాసీ కొలాం గిరిజనులతో కలిసి విడుదల చేశారు. ఇందులో పీవో(పీవీటీజీ) మెస్రం మనోహర్, కొలాం సంఘం నాయకులు మొకాషి, బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి అందాలకు నిలయం ఆదిలాబాద్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా సహజ ప్రకృతి అందాలకు నిలయమని, పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇవి మరింత ప్రాచుర్యంలోకి వస్తాయని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం టూరిజం శాఖ ఆధ్వర్యంలో టీటీడీసీ సమావేశ మందిరంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా కలెక్టర్ జిల్లాలోని అందమైన ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాలపై ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఈఓ ప్రణీత, టూరిజం అధికారి రవికుమార్, డీపీఆర్ఓ తిరుమల పాల్గొన్నారు.

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని టీటీడీసీ భవనంలో శుక్రవారం నిర్వహించిన వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫీ పోటీలలో ఉట్నూర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ మరికంటి మహేష్‌కు కలెక్టర్ రాజర్షిషా ఉత్తమ అవార్డును అందజేశారు.

తెల్లబంగారం ఏరివేత షురూ!!

జిల్లాలో పత్తి పంట ఏరివేత షురూ అయ్యింది. మరికొన్ని రోజుల్లో కొనుగోళ్లు సైతం ప్రారంభం కానున్నాయి. చేతికి వచ్చిన పంట తేమ కారణంగా తడిగా ఉండడంతో రైతులు ఆరుబయట ఆరబెట్టే పనుల్లో ఉన్నారు. మార్కెట్లో నాణ్యమైన పత్తికే మద్దతుధర దక్కుతుందని మార్కెటింగ్ అధికారుల ప్రచారం. ఈ నేపథ్యంలో తేమ శాతం తక్కువగా ఉండేలా పత్తిని ఎండబెడుతున్నారు. వాస్తవానికి ఈ పాటికే కొనుగోళ్లు ప్రారంభం కావాల్సి ఉండగా.. ఈసారి వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కొంతమేర ఆలస్యం అయ్యింది. తెల్లబంగారం రాకతో రైతుల్లో మొహముల్లో ఆనందం వెల్లివెరుస్తోంది. ఆశించిన మేర దిగుబడి కూడా వస్తుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

(స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)

ఫొటో న్యూస్



గ్రామాల్లోని పంటచేలల్లో పత్తిని ఏరుతున్న మహిళా కూలీలు



కజ్జర్ల గ్రామంలో పత్తిని ఆరబెడుతున్న రైతు